# శంబల

## SPIRITUAL WISDOM



శ్రీ శార్వరి

## ‘శంబల’ లలో ...


| | | |
|---|---|---|
| 1. | ఛాంగు భలా! | 5-14 |
| 2. | శంబల చరిత్ర | 15-27 |
| 3. | కాలచక్ర | 28-38 |
| 4. | గౌతమ బుద్ధ | 39-48 |
| **శంబల ... ఒక అవగాహన** | | 49-50 |
| 1. | స్వప్న సందేశం | 51-67 |
| 2. | ఖాట్మాండు ప్రయాణం | 68-76 |
| 3. | లామా కలాపం | 77-93 |
| 4. | మరో ప్రస్థానం | 94-105 |
| 5. | కైలాస దర్శనం | 106-118 |
| 6. | శంబల జీవనం | 119-138 |
| 7. | బై ... బై ... శంబలా! | 139-154 |
| | చిటారు కొమ్మన ... డాక్టర్ వాసిలి వసంతకుమార్ | 155-158 |


*గమనిక : ‘శంబల’ నవలలోని పాత్రలు అన్నీ కల్పితాలు.*
*‘కథా రచన’ కోసం కల్పించబడిన పాత్రలు.*




# 1. ఢాంగు భలా!

**టి**బెట్ బౌద్ధానికి గుండెకాయ శంబల!

శంబల గురించి ప్రపంచానికి పరిచయం అయింది నిన్న మొన్న.

చరిత్రలో నిన్న, మొన్న అంటే ఒకటి రెండు శతాబ్దాల క్రితం అని.

అయినా శంబల చరిత్ర ఇంకా పరిశోధన వలయంలోనే ఉంది. చారిత్రక విశేషాలు, అవశేషాలు ఎక్కడా కనిపించవు. శంబల కొత్తగా చరిత్ర పుటల్లోకి రాలేదు. ఊహాపోహలే తప్ప భూగోళంపైన ఫలానా చోట శంబల అని ఎవరూ గుర్తు పెట్టరు. శంబలకు రెండు వేల సంవత్సరాల ప్రాచీనత ఉంది. అదే ఆధారం.

శంబల అంటే ఒక తపోలోకం అనుకుందాం. భూలోకం, భువర్లోకం, సువర్లోకం, తపోలోకాల కోవలోనిది అనుకుందాం. అప్పుడు దానికి హిస్టరి, జాగ్రఫి ఉండవు. అది ధ్యానుల లోకం అవుతుంది. ఆత్మల ఆవాసం అవుతుంది. సూక్ష్మ శరీరాల కదలిక తెలుస్తుంది. అక్కడ ఎవరూ సమాధిలో ఉండరు. ఎరుకతో ఉంటారు. చైతన్యంగా ఉంటారు. మనకూ వారికీ ఉండే సంబంధం ఆత్మ ప్రకరణం.

19వ శతాబ్దం చివరన శ్వేతయోగిని మాడం బ్లవట్స్కీ తేనె తుట్టెను కదిలించింది. టిబెట్‌లో పరమ గురువులైన మాస్టర్లు ఉన్నారని, స్వయంగా టిబెట్ వెళ్లి, లామాలతో సంధానపడి దివ్యజ్ఞానం బయటకు లాగింది. ఆ తర్వాత లోకానికి

మాస్టర్లపై శ్రద్ధ పెరిగింది. మాస్టర్ మోర్య, కుత్‌హోమి, జ్వాల్‌కుల్ దివ్యజ్ఞానులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించడంతో శంబల రహస్యం కాస్త బయటపడ్డది.

భౌగోళికంగా శంబల స్థానం ఏది? తెలియదు. దాని చరిత్ర ఏమిటి? తెలియదు. హిమాలయాలకు ఆవల గోబి ఎడారి మధ్యన అని ఒక నమ్మకం. టిబెట్ అని మరొక నమ్మకం. హిమాలయాల పైన, మానస సరోవరం దిగువన అని మరొక విశ్వాసం. అసలు శంబల అన్నదే లేకపోతే దాని గురించిన కథలు పుట్టవు. కేవలం కల్పన అనలేం కదా! లేనిదాన్ని ఉన్నదనుకోవడం, ఆ సంస్కృతిని గొప్పగా అభిమానించి, ఆరాధించడం ఎలా సాధ్యం? కేవలం బ్రహ్మ జ్ఞానులకో, ఆత్మ విదులకో అందుబాటులో ఉంటే సామాన్యులకేం ప్రయోజనం? శంబల మన స్వర్గం వంటి మరొక భూమిక అందామా? భావన అందామా!

అది లేదంటే లేదు – ఉన్నదంటే ఉన్నది. అది ఎట్లా? విశ్వాసం, నమ్మకం. విశ్వాసం ఉన్నంత మాత్రాన శంబల ఉన్నట్లా? చూద్దాం. విశ్వాసం వెన్నంటి సందేహం ఉంటుంది. అది సహజం. ఉన్నది, లేదు అనే సందిగ్ధ స్థితిని scepticism అంటాం. రెండు వైపుల వాదించ వీలుండేది స్కెప్టిసిజం. సదసత్ అన్నది ఒక విధంగా అవకాశ వాదం. నమ్మకం అనే కత్తితో విశ్వాసాన్ని ఖండించనూ వచ్చు, పదును పెట్టనూ వచ్చు.

★ ★ ★

1838లో పారిస్‌లో 'డగురే' అనే వ్యక్తికి పిచ్చి పట్టింది. పిచ్చి అంటే నిజం పిచ్చి కాదు. నమ్మకం పిచ్చి. పిచ్చి నమ్మకం. ఆయన గారి భార్య అతన్ని డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్లింది. ఆయనొక పిచ్చి డాక్టరు. రోగిని క్రింద మీద, బయట లోపల పరీక్షించాడు. అతని పిచ్చి – మనిషి నీడను రాగిరేకు పైన పట్టుకోవచ్చు అన్నది. అతన్ని పారిస్‌లోని పెద్ద పిచ్చాసుపత్రికి పంపారు. అక్కడ వైద్యులు అతని మానసిక స్థితుల్ని విశ్లేషించి, పరిశోధించి ఫొటోగ్రఫీ కనిపెట్టారు. ఒక పిచ్చి వాడి పిచ్చి ఎంత పరిశోధనకు ఆకరమైంది.

మనిషి నీడను ముద్రించడం అన్నది వాస్తవం అయింది గదా! శంబల కథ కూడా అలాంటి నీడ. యుగయుగాల మానవ నాగరికత, సంస్కారం, శంబలలో దాచి పెట్టబడిందట. చరిత్రకు నిధి శంబల. సంస్కృతికి కేంద్ర బిందువు శంబల. ఒక్క మాటలో చెప్పాలంటే భూగ్రహ వాసుల వారసత్వ సంపద శంబల. మృత్యువును జయించిన మహా ఋషుల నెలవు శంబల. వారికి జరామృత్యు భయం లేదు కనుక వారు శాశ్వతులు, అమరులు, మృత్యుంజయులు. అక్కడ ప్రాంతీయ భేదం లేదు. ప్రతి మనిషికి అక్కడ ప్రవేశార్హత ఉంది.



# 2. శంబల చరిత్ర

**చై**నా వారి నమ్మకాలకు మన భారతీయుల విశ్వాసాలకు పెద్ద తేడా లేదు. **భాగవత పురాణం**లోని **'వాచస్పత్యం'**లో **జంబూద్వీప** వర్ణన ఉంది. జంబూ ద్వీపం అంటే శంబల ద్వీపం అనే. అది హిమాలయాలకు ఉత్తర దిగ్భాగంలో ఉన్నదని ప్రతీతి.

నేటి టిబెట్ దేశం మొత్తాన్ని ఆర్యావర్తం అనేవారు. (ఆర్యులు నివసించిన ప్రదేశం అని) ఆర్యులు అంటే ఆత్మజ్ఞానం కలవారని, సంస్కృతి కలవారని అర్థం. అది లేని వారు అనార్యులు. అంటే భౌతికవాదులు. కల్కి అక్కడే అవతరిస్తాడని ఒక నమ్మకం. కల్కి మనకు దశమావతారం. కైలాస పర్వతానికి ఉత్తరభాగాన ఉన్నదే శంబల. అదే బౌద్ధ గురువుల ప్రధాన కేంద్రం.

**కూర్మ పురాణం** ప్రకారం ఉత్తరాన చాలా దూరంగా, సముద్రం మధ్యలో శ్వేత దీపం ఉంది. అది యోగ పురుషుల ఆవాసం. ఒకానొక కాలంలో గోబి ఎడారి ప్రాంతం మహా సాగరంగా ఉండేది. దానిలో ఉన్న ఒక ద్వీపం శ్వేతద్వీపం. ఎత్తైన పర్వత పంక్తుల నడుమ లోతైన లోయలలో సర్వసుభిక్షంగా ఉండేది శంబల. అక్కడ అమృత సరోవరం ప్రస్థావన ఉంది. అమృత సరోవరం అంటే మానస సరోవరం. ఆ దీవి నిండా సుందర వనాలూ, ఆకాశ హర్మ్యాలూ ఉండేవట. అక్కడకు వెళ్లేవారు బంగారు విమానాల్లో వెళ్లే వారుట.

టిబెట్ గ్రంధాలలో శంబల పేరు 'డీజుంగ్'. ఫాదర్ స్టెఫన్ కాసెలా అనే పోర్చుగల్ మతాచార్యుడు ఇరవై మూడు సంవత్సరాలు శంబలలో ఉండి 1650లో అక్కడే సమాధి అయినాడు. శంబలకు 'టార్టారియా' అని మరొక పేరు ఉంది. ఇటీవల కాలంలో రష్యన్ పరిశోధకుడు ఫ్రెజ్ వల్ష్కీ ఇలా రాశాడు :

"ఉత్తరాన మహాసముద్ర మధ్యంలో **'శంబలింగ్'** అనే దీవి ఉంది. అక్కడ బంగారం పండుతుంది. పాలు, తేనెలు నదుల్లా ప్రవహిస్తుంటాయి. శంబలలో బౌద్ధ విజ్ఞానం యావత్తు **'కాలచక్రం'** పేర నిక్షిప్తమై నిగూఢంగా ఉంది. దానిని **'భగవాన్ వజ్రపాణి గుభ భదేశ'** తంత్రరాజు (కాలచక్ర) అంటారు.

1447లో షిగాట్సే వద్ద బయటపడిన **'తాషీలుంపో'** మఠం శంబల గురించి లోకానికి తెలియజేసింది. అక్కడ లామాసరి మఠంలో నాలుగు వేల మంది విద్యార్థులు ఉండేవారని, చాలా విద్యాలయాలు, ప్రార్థనా మందిరాలు ఉండేవని సమాచారం. 1923లో 6వ పెంచన్ లామా షిగాట్సే వదలి చైనాకు పారిపోవడం జరిగింది. టిబెట్‌లో శంబల యాత్రికులకు పెంచన్ లామా అనుమతి పత్రాలు ఇచ్చేవాడట. లామాలలో అర్హులైన వారికే అనుమతి లభిస్తుందేది.

## పెంచన్ లామా

టిబెట్ పేరు చెప్పగానే, టిబెట్ బౌద్ధం పేరు వినగానే దలైలామా పేరు జ్ఞాపకం వస్తుంది సహజంగా. ఆయన టిబెట్ బౌద్ధానికి ఏకైక ప్రతినిధి. కానీ ఆయనకన్న ఆరాధనీయుడు పెంచన్ లామా. అతను గొప్ప యోగి, శక్తివంతుడు అంటారు. ఆయన అసలు పేరు పండిత చెన్‌పో. ఆయనకు అనేక సిద్ధులు ఉండేవి.

పెంచన్ లామా 1915లో ఒక మందిరం కట్టించాడు. అందులో మైత్రేయ భారీ విగ్రహం ఏర్పాటు చేశాడు. మైత్రేయ గౌతమ బుద్ధుని రాబోయే అవతారం. ఆ సంవత్సరం 'శాంగ్‌పో' లోయలో పంటలు విపరీతంగా పండాయి. 1923లో ఆయన టిబెట్ వదలిపోగానే మంచు వర్షాల వల్ల దేశం మొత్తం నీటిపాలైంది. కొంత జన నష్టం జరిగింది. సత్పురుషుల ఆగ్రహం దేశానికే అరిష్టం!

పెంచన్ లామా ఇండియా వచ్చినపుడు ఆయనను ఒకరు ప్రశ్నించారు –

"లామా! టిబెట్‌లో గొప్ప గొప్ప యోగులు ఉంటారని విన్నాం. ఇప్పుడు అటువంటి అతీంద్రియ సిద్ధులు కల యోగులు ఉన్నారా?"



# 3. కాలచక్ర

**గౌ**తమ బుద్ధునికి గయ అత్యంత ప్రీతి పాత్రం. బుద్ధుని అనుయాయులకు అమరావతి ధాన్యకటకం ఇష్టం. ఆనాడు ఆంధ్రదేశం బౌద్ధాన్ని ఒడిలో పెట్టుకుని సాకింది. ఆ విషయం మన కంతగా తెలియదు. బౌద్ధులకు మాత్రం బుద్ధ గయ తర్వాత అమరావతి ముఖ్యమైన పుణ్యక్షేత్రం. గౌతముడు జ్ఞానోదయం పొందిన తర్వాత, తన ఆప్తమిత్రులకు ఉపదేశం చేసింది గయలో. కాలచక్ర సిద్ధాంతాన్ని బోధించింది ధాన్యకటకంలో. మొనమొన్న కాలచక్ర మహా సభలు జరిగే వరకు అమరావతి ప్రాశస్త్యం మనకు అంతగా తెలియదు.

కాలచక్రానికి, బౌద్ధానికి ఏమి సంబంధం?

శంబలకు, బౌద్ధానికి ఏమి సంబంధం?

శంబలకు, నాగార్జున కొండకు ఏమిటి సంబంధం?

టిబెట్ వారి ప్రాచీన గ్రంథాలు **కంజోర్, టంజోర్** మూల ప్రతులు శంబలలో భద్రంగా ఉన్నాయి. బౌద్ధ ధర్మం యావత్తు కాలచక్రలో నిక్షిప్తమై ఉంది. తర్వాతర్వాత బౌద్ధ ధర్మం శంబల నుండి ప్రపంచ మంతటకు వ్యాపించింది.

'కాలచక్రం' బౌద్ధ విజ్ఞాన సర్వస్వం. బుద్ధుని హృదయం. అంత మాత్రాన శంబల వాసులంతా కాలచక్రానికి అంటి పెట్టుకుని ఉండరు. అందరూ బౌద్ధంలో

నిష్ణాతులు కారు. అందరూ బౌద్ధులు కారు. అసలు బుద్ధిలేని వారూ ఎక్కువే. కొద్ది మంది మహా లామాలు, బౌద్ధ నిష్ణాతులు కాలచక్ర మహిమ తెలిసినవారు. అసలు కాలచక్రం చదివితే, ఎవరికీ ఏమీ అర్థం కాదు. కాకపోవడానికి అది పద్యం కాదు. గద్యం కాదు. అంతా సింబాలిజం. ఏవో గీతలు, బొమ్మలు ఉంటాయి. వాటి అర్థం తెలిసినవారు చెప్పవలసిందే. బోధిసత్వులకు మాత్రమే కాలచక్ర రహస్యాలు మింగుడు పడతాయి. బోధిసత్వులంటే పరిణామంలో పూర్ణత్వం సాధించి మృత్యువును జయించినవారని అర్థం.

షిగాట్సే సమీపంలో 'తుష్లుంపో' మొనాస్టరీ టిబెట్ ఈశాన్యంలోకి వస్తుంది. కుంబు లామాసరిలో కాలచక్ర విద్యాలయాలు ఉన్నాయి. మంగోలియాలో కాలచక్రం బోధించగల లామాలుండేవారు. ముందుగా కఠినమైన శిక్షణ పూర్తి చేసిన వారికే అందులో ప్రవేశం లభించేది. కాలచక్ర విద్యాభ్యాసంతో లామా శిక్షణ పూర్తయ్యేది. ముఖ్యమైన లామాలే కాలచక్రం నేర్చుకునేవారు. అంటే అవి రహస్య విద్యాకేంద్రాలు (ఈసాటరిక్ సెంటర్స్).

లామాల్లో పసుపురంగు టోపీల వాళ్లు 'శాంగ్ లాంపా' వర్గం వారు. వీరు బౌద్ధంలో కొత్త సంస్కరణలు తెచ్చినవారు. వీరు తంత్రాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తారు. వారి పూర్వీకుడు 'శాంగ్‌చుపా' స్వయంగా కాలచక్రను వ్యాఖ్యా నించినవాడు.

కాలచక్ర అధ్యయనంలో ఖగోళం, జ్యోతిషం, సంస్కృతం ప్రత్యేక విభాగాలు. సంస్కృత పండితులకు సైతం కాలచక్రం అర్థం కాదు. గురువులైన లామాలే వివరించి చెప్పగలరు. మామూలు లామాలకు దానిని చదవడం రాదు. ఈ మధ్య కాలచక్ర విలువ పెరిగింది. ప్రచారం పెరిగింది. కాలచక్ర బోధన శంబల నుండి పదవ శతాబ్దంలో భారత్‌కు చేరింది. లామాలకు శంబల వెళ్లే మార్గాలు తెలుస్తాయి. వారి సహకారం లేకుండా ఎవరూ శంబల చేరడం దుర్లభం.

బుద్ధుడు స్వయంగా ధాన్యకటకంలో తన శిష్యులకు బోధించాడు.

ఆ సమయంలో శంబల రాజు సుచంద్ర అనేక మంది శిష్యులతో అక్కడ ప్రత్యక్షమై బుద్ధుని పాఠం విన్నాడుట. వేయి సంవత్సరాల క్రితం కాలచక్రం సిద్ధాంతీకరించబడ్డది.

కాలచక్ర విజ్ఞాన కర్తలైన రుషులు, బోధిసత్వ విజ్ఞానం అధ్యయనం చేసినవారు భారతదేశంలో చాలా మంది ఉండేవారు. ఆనాటి కాలచక్రం పండితులలో ఒకరు 'శీలు'. ఆయన ఒరిస్సాలో జన్మించాడు. ఒకే జన్మలో బోధిసత్వులు కావాలనుకునేవారు ఆ సిద్ధాంతం పాటిస్తారు.



# 4. గౌతము బుద్ధ

**మ**నం అవునన్నా, కాదన్నా శ్రీకృష్ణుని వలె గౌతమ బుద్ధుడు పరమ గురువుల శ్రేణికి చెందినవాడు. మహాపురుషు లందరు 'శంబల'ను దర్శించి వచ్చినవారే. హిమాలయాలపై అడుగుమోపని మహాత్ములు లేరు.

శుద్ధోధనుడు కపిలవిష్ట రాజు. ఆయన అర్ధాంగి మాయ. కపిల విష్ట హిమాలయ ప్రాంతం. సిద్ధార్థుడు జన్మించినపుడు ఏడుగురు మహర్షులు కపిల విష్ట రాజమందిరానికి విచ్చేశారు (సప్తర్షులా?). వచ్చి సిద్ధార్థుని దర్శనం చేసుకుని దీవించారు. ఆ ఏడుగురు మహర్షులు శంబల వారేనని, హిమాలయాలు దాటి వచ్చారని కథలున్నాయి.

పదహారవ ఏటనే గౌతమునికి వివాహం జరిగింది. ఒక కొడుకు రాహులుడు కలిగాడు. తర్వాత పదమూడు సంవత్సరాలకు ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. రాజ్యాన్ని, రాజభోగాలను, భార్యాపుత్రులను త్యజించాడు. సన్యాసం సుఖం అనుకున్నాడు. ఒక విషాదం మరొక నిర్వేదం. గౌతముని వైరాగ్యానికి కారణం? విరక్తి తర్వాత విముక్తి మార్గం సన్యాసమే కదా!

అప్పటికి దేశంలో కుల వ్యవస్థ తారస్థాయిలో ఉంది. కుల విభేదాన్ని నిర్మూలించి విశ్వమానవ దృక్పథం కలిగించాలని ఆశించాడు. ఉన్న వ్యవస్థపై తిరుగుబాటు విప్లవం. అది సామాజిక విప్లవం. చాదస్తాలను త్రోసి రాజన్నాడు,

నమ్మకాల నెత్తిన నల్ల ముసుగులు వేశాడు. దేవతా విగ్రహాలను తీసి ప్రక్కన పెట్టాడు. ఆడంబరాలపై తెరదించాడు. మంచి నుండి మంచి పుడుతుంది. చెడు నుండి చెడు పుడుతుంది. గౌతముని సంకల్పం మంచిది. దానికి విశ్వప్రేమ, కరుణ భూమికలు. సరికొత్త జీవన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కరుణాంత రంగుడై బుద్ధుడైనాడు.

సిద్ధార్థ గౌతముడు ఒక బోధివృక్షం నీడలో జ్ఞానం పొందాడు. తనలో విశ్వాన్ని దర్శించాడు. విశ్వంలో తన చైతన్యం లయం చేశాడు. విశ్వజనీనత సాధించాడు. తర్వాత వారికి తనే మార్గదర్శి. తన జీవన విధానమే ఆదర్శం. అతి సామాన్యుడు సైతం ఆచరించదగిన ఎనిమిది సూత్రాలు ప్రతిపాదించాడు. తాను ఆచరించినవే ఇతరులకు బోధించాడు. సద్వర్తన, సదాలోచన, సచ్ఛీలత, సద్భావన, సత్ప్రవర్తన, సద్యోగం, సద్గోష్ఠి, సదవగాహన గౌతముడు ప్రతిపాదించిన అష్టాంగ సూత్రాలు. అవి జీవన సూత్రాలు. ఏ దేశంలోని వారైన సులభంగా ఆచరించదగ్గవి. కోరికల్ని జయించి జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవడం అంతరంగ రహస్యం.

గౌతముడు జ్ఞానోదయం కాక ముందు శంబల దర్శించిన కథ ఉంది. ఇంటి నుండి బయలుదేరిన గౌతముడు రెండు వారాల పాటు గుర్రం మీద హిమాలయాలపై వెళ్లాడు. తర్వాత ఒక సన్ననిబాట వెంట ఒక వారం రోజులు ప్రయాణం చేశాడు. అక్కడ ఒక వేటగాని గుడిసెను చేరాడు. ఆ వేటగాడు గౌతముని రాకకోసమే ఎదురు చూస్తున్నట్లు సంబరపడిపోయాడు. ఆ రాత్రి గుడిసెలో విశ్రమించి మర్నాడు ఉదయం తేనె ఆహారంగా తీసుకుని, ఆ వృద్ధునితో కలిసి మధ్యాహ్నానికి ఒక నదిని చేరాడు. విలుకాడు విల్లు ఎక్కుపెట్టి బాణం వదిలాడు. అప్పుడే గౌతముడు తన నగలు, పట్టుబట్టలు తీసి మూటగట్టి, విలుకాని సలహా మేరకు ఆ మూటను నదిలో విసిరివేశాడు. వెంటనే ఒక ఆజానుబాహువు అవతల ఒడ్డు నుండి పడవలో వచ్చి గౌతముని ఎక్కించుకుని నదిని దాటించాడు. నది అవతల ఒడ్డున వీరి కోసం రెండు గుర్రాలు సిద్ధంగా ఉన్నాయి. ఆ ఇద్దరు గుర్రాలు ఎక్కి మంచు పర్వతాలపైన ప్రయాణం చేశారు. సూర్యోదయ వేళకు పరమ గురువుల సన్నిధికి చేరారు. అది శంబల.

శ్రీకృష్ణుని వలె గౌతమ బుద్ధుడు తన జన్మ రహస్యం తెలియచేశాడు. "నేను అనేక రూపాలలో అనేక విధాలుగా బహుజనుల్ని నడిపిస్తుంటాను."

బుద్ధుని రచనల్లో ఆ ప్రస్తావన ఉంది ... అప్పుడప్పుడు బుద్ధుడు జన్మిస్తుంటాడని. ప్రతి జన్మలోనూ ఆయన ధర్మరక్షణ కార్యక్రమం నిర్వహించాడని. ఈసారి బుద్ధుడు 'మైత్రేయ'గా అవతరిస్తాడని బౌద్ధ ప్రపంచం విశ్వసిస్తోంది.




# 1. స్వప్న సందేశం

**అవును నేనేమిటి!**

**శంబల యాత్ర చేయటం ఏమిటంటారా?**

అసలు నేను మంచి వాడినా? చెడ్డ వాడినా? అదీ డౌటే!

లోకంలో అందరూ మంచి వాళ్లే ఉండరు. అందరూ చెడ్డవాళ్లే ఉండరు!

లోకం అంటేనే మిక్సర్ పొట్లాం!

కాకపోతే మంచిగా నటించే చెడ్డవాళ్లుంటారు.

చెడ్డగా బ్రతికే మంచివాళ్లుంటారు.

మంచివాళ్లు, చెడ్డవాళ్లు కలిసి బ్రతుకుతున్న లోకం మనది.

ఇంతకీ నేను మంచివాడినా? చెడ్డవాడినా? అని మీ డౌట్ కదూ!

చెప్పాగా, ఆ డౌట్ మీకే కాదు ... నాకూ డౌటేనని ...

★ ★ ★

**యో**గంలో చేరకముందు నేను కాస్తంత మంచి వాడిననే చెడ్డ పేరుంది. నాకంత మంచి చెడ్డవాడని పేరు రావడానికి కారణం లేదు. నేను చాలా సాదా మనిషిని. సాదాగా బ్రతకాలనుకున్న వాడిని. లోకంలోకి ఎందుకు వచ్చానో,

ఎందుకు పోయానో తెలియనీయకుండా బ్రతికి చద్దామనుకున్నవాడిని. ఏదీ మన ఇష్టంతో జరుగదు. బ్రతకడం, చావడం మనిష్టం కాదు. మన బ్రతుకు మనల్ని బ్రతకనీయదు లోకం. మన చావు మనల్ని చావనీయరు అయినవాళ్లు. చిత్రమైనది లోకం. విచిత్రమైనది ఈ సంసారం.

చెప్పాగా! యోగంలో చేరకముందు నేను కాస్త మంచివాడినని నా నమ్మకం.

ఎప్పటికైనా ఒక గొప్ప వాడిని కావాలన్నది కన్నవారి చిరు కోరిక.

బాగా డబ్బు సంపాదించి గొప్పగా బ్రతకాలని అయినవారి ఆరాటం.

మనిషి ఇన్ని కాంక్షల మధ్య, ఆకాంక్షల మధ్య పెరిగి ఏదో సాధించాలి! అయ్యేపనా? అందరి ఆశలు వమ్ము చేసి, సన్యాసిని కావాలన్నది నా కోరిక! అదీ కాలేకపోయాను. కారణం లోకం? మన ఇష్టం వచ్చినట్లు మనల్ని బ్రతకనీయని ఈ దుష్ట దుర్మార్గ లోకం.

యోగంలో చేరిన కారణంగా నా కలలన్నీ కరిగిపోయాయి. ఎందుకంటే నేను ప్రపంచానికి బొత్తిగా పనికిరాని మనిషినని నాకే తెలిసిపోయింది. అప్పుడే నాకు రవంత ఆత్మజ్ఞానం కలిగింది. బుద్ధుడికీ దాదాపు అదే వయసులో జ్ఞానోదయం అయిందిట. నేను బుద్ధుడంతటి వాడిని కాదు. బుద్ధుడు నా అంతటివాడు కాలేడు. ఆయనది జ్ఞానోదయం. నాది ఆత్మజ్ఞానం. ఎంత తేడా! ఏమో! నాకంత జ్ఞానం లేదుగా. నేను ప్రపంచానికి పనికిరానని మాత్రం తెలిసిపోయింది.

నేను ఎవరో తెలుసుకోడానికి నాకు చాలా కాలం పట్టింది. నాకు నేను ఉపయోగపడనప్పుడు ప్రపంచానికి ఎలా ఉపయోగపడగలను? అంతే. ఎటూ ఉపయోగం లేని మనిషిని యోగం రమ్మని పిలిచింది. నా మీద నేనే ప్రయోగాలు చేసే క్రమంలో పిచ్చిపిచ్చిగా చదవసాగాను. అన్నీ పిచ్చి పుస్తకాలే. లైబ్రరీల్లో ఎవరూ ముట్టుకోని పుస్తకాలు - అంటే వేదాంత, తత్వ, యోగ సాహిత్యం అన్నమాట. ఒక పిచ్చి వదిలించుకోడానికి మరొక పిచ్చిని స్వాగతించాను. అప్పుడే హిమాలయాలపట్ల ఆసక్తి కలిగింది. రుషీకేశ్ పారిపోయి కాషాయం కట్టాలనుకున్నాను. కుదిరింది కాదు. మామూలు మనిషిగా తపస్సు చేస్తే ఏ దేవుడు గానీ, దేవత గానీ ప్రత్యక్షం కాకపోతారా? కనీసంగా రెండు మూడు వరాలైనా ఇవ్వకపోతారా? మరీ ఒక్క వరం ఇచ్చి సరిపెట్టుకోమనే పిసినారి దేవుళ్లు ఉండరు కదా! ఒక మహర్షిని అయిపోవాలనుకున్నా అదీ కష్టమైన వ్యవహారమే కదా!



# 2. ఖాట్మండు ప్రయాణం

**భా**ర్గవ చకచక ఏర్పాట్లు చేశాడు. ఎక్కడ ఎవరిని పట్టాలో ఆయనకు తెలుసు. నిత్య యాత్రీకుడు గదా! శంబల ప్రయాణం అనగానే ఎగిరి గంతేశాడు. ఏదో స్వర్గం నుండి ఆహ్వానం వచ్చినంత సంబరపడ్డాడు. శంబల అంటే స్వర్గా రోహణమే. ధర్మరాజు, భార్య ద్రౌపదితో, సోదరులతో కలిసి హిమాలయాలు ఎక్కాడు స్వర్గారోహణ పర్వంలో. హిమాలయాలు ఎక్కడం అంటే స్వర్గా రోహణమే. వ్యాసుల వారు రాయలేదు గాని ఆ స్వర్గం శంబలయే అయి ఉండాలి. శంబల అందరూ చేరలేరు.

నాతో ప్రయాణం అంటే భార్గవ థ్రిల్ ఫీలవుతున్నాడు. కలిసి నడిచినా ఎవడి నడక వారిదే. ఎవరికి ఎంత ప్రాప్తమో అంతే లభిస్తుంది. నాకు లోలోపల సంతోషంగా ఉన్నా, ఎందుకొచ్చిన బాధ అనిపిస్తోంది. టిబెట్ అనే సరికి కాస్త భయం. నేపాల్, ఖాట్మండు వరకు ఫరవాలేదు. ఆపైన చైనావారి అధికారం. అడుగడుగునా ఆంక్షలు, అవరోధాలు. వీసా దొరకడం కష్టం. ప్రయాణం అంతకంటే కష్టం. ఎవరెస్టు వెళ్లే వారినే చైనా ప్రభుత్వం ముప్పు తిప్పలు పెడుతుంది. అందునా ఇండియా నుండి వచ్చే వారంటే చైనా వారికి మరీ మంట. సవాళ్లు తప్పవు.

'హోటల్ హిమాలయ'లో గదులు రిజర్వ్ చేశాడు భార్గవ. ఢిల్లీ నుండి బయలుదేరిన రెండు గంటల్లో ఖాట్మండు చేరాం. నాకున్నది పుస్తకాల జ్ఞానం. భార్గవది అనుభవ జ్ఞానం. ఫొటోల్లో హిమాలయాలు అద్భుతంగా ఉంటాయి. కానీ ఎక్కాలంటే తల ప్రాణం తోకకు వస్తుంది. ఖాట్మండులోనే మా కష్టాలు ప్రారంభమైనాయి. భార్గవ తోడు ఉన్నాడన్న ధైర్యం. అనుభవం ఉన్నవాడు. కనీసంగా మానస సరోవరం వరకు తీసుకు వెళ్లగలడు. అక్కడ నుండి కైలాసానికి ఓ నమస్కారం చేసుకుని తిరిగి రావచ్చు.

హోటల్ హిమాలయలో సామాను పడేసి రిలాక్స్ అయినాం. తర్వాత రెస్టారెంట్‌లో చాయ్ కోసం వెళ్లాను. నా కాషాయ బట్టలు బాగా ఉపకరించాయి. నన్నొక స్వామీజీగా గౌరవించారు. నిజానికి ఆ కాషాయ బట్టలతోనే నా కష్టాలూ ప్రారంభమైనాయి. ఇండియాలో అయితే కాషాయాన్ని అభిమానిస్తారు, ఇతర చోట్ల ఎబ్బెట్టుగా చూస్తారు. కాషాయం కట్టిన వాళ్లను వింతగా చూస్తారు. ప్రతివారు నమస్కరిస్తారు లేదా తప్పుకుపోతారు. హోటల్ హిమాలయలో ఇండియన్స్ ఎక్కువగా కనిపించరు. అందులో శంబల వెళ్లేవాళ్లు అసలు ఉండరు. మానస సరోవర్‌కి, ఎవరెస్ట్ దర్శనానికి వచ్చేవారు ఎక్కువ. పర్వతారోహణ కోసం వచ్చే పాశ్చాత్యులు ఎక్కువ. హోటల్ వ్యాపారం బాగానే ఉంది. నా వరకు నేను ఏదో విచిత్ర లోకంలోకి వచ్చి పడ్డట్టుంది. కమ్మని తెలుగు మాట్లాడేవారు ఒక్కరూ లేరు.

నా అంతరాత్మ ఒకటే సణుగుడు. ఏదో మిస్టరీ జరగబోతోందని. ఏమిటో ఈ ప్రయాణం! శంబల వెళ్లేవారిని ఎవరో వచ్చి గైడ్ చేస్తారుట. నా కోసం ఎవరు వస్తారు? అదొక పిచ్చి నమ్మకం. ఆరాటం. వస్తూ పోతున్న వారి ముఖాలు చూస్తున్నాను. నాకోసం వచ్చేవాడు నన్ను గుర్తించాలి గదా! వారు నాకోసమే వచ్చారని నేను గుర్తించాలి గదా. ఎప్పుడూ లేనంత ఉద్వేగం. ఎప్పుడూ కలగనంత శూన్యత నాలో. అవ్యక్తమైన చైతన్యం. లాన్స్‌లో కూర్చుని చాయ్ తాగి, సిగరెట్ వెలిగించాను. అక్కడ చలికో ఏమో సన్యాసులు, బైరాగులు దమ్ముకొడుతున్నారు. మన దేశంలో అయితే కాషాయ స్వాములు బాహాటంగా సిగరెట్ కాల్చరు. లోపల ఎక్కడో కాల్చినా, పొగ బయటకు రానీయరు. శిష్యులు ఆ పొగ శేషం చప్పరిస్తారు. దూరం నుండి ఒక పొడవైన వ్యక్తి నన్ను చూచి నావైపు రాసాగాడు. సరాసరి వచ్చి నా ఎదురు సీట్లో కూర్చున్నాడు. అంతలోనే భార్గవ వచ్చి కలిశాడు.

"గురూజీ గమనించారా! ఇక్కడ వాతావరణం ఎంత టెర్స్‌గా ఉందో."

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sambala**

* * *